క్లుప్తంగా

విద్యార్థుల చేతుల్లో దేశ భవిత



లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, దేశాభ్యున్నతికి మనం మారుతూ సమాజాన్ని మార్చాలని శ్రీహరికోటలోని ఇస్రో సిస్టమ్ రిలయబిలిటీ డెప్యూటీ డైరెక్టర్ పి.సునీల్ అన్నారు. నగరంలోని శారద విద్యాసంస్థల ప్రెషర్స్ డే వేడుకలు శనివారం లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. సునీల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దృఢసంకల్పంతో ఉండాలని సూచించారు. ఉన్నత విద్యతో మహోన్నత పదవులను అధిరోహించాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందుబాటులో ఉన్న విద్యావనరులను ఉపయోగించుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి గురవకుండా లక్ష్యాన్ని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో శారద విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, చైర్మన్ డాక్టర్ రమేష్‌బాబు, అడ్వైజర్ ఈఎస్ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు హోరెత్తాయి. సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు.

అలరించిన భక్తిగీతాలు



విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రుల్లో భాగంగా శనివారం సంగీత విద్వాంసురాలు రాగంపూడి అమూల్య, ఇంద్రకీలాద్రి శర్మ బృందంలోని చిన్నారులు ఆలపించిన భక్తి గీతాలు, అన్నమయ్య, రామదాసు రచించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘం నిర్వాహకులు దశరథ రమేష్, అనుముల శేఖర్ పాల్గొన్నారు.

వైరల్ జ్వరాలపై అప్రమత్తం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైరల్ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వైద్య పరీక్షలు చేయించుకోవాలని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా హాఫీజుల్లా సూచించారు. ఎంకే బేక్ స్కూల్ పరిసర ప్రాంతాల్లోని 23,24,25 బ్లాక్‌లలో శనివారం ఆమె పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పరచి పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వందనంబాబు, సచివాలయ శానిటరీ సెక్రటరీలను ఆదేశించారు. ఆయా బ్లాక్‌లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గ్యాంగ్ వర్క్ ద్వారా డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించారు. కాలువల్లో చెత్త వేయొద్దని, ఎప్పటికప్పుడు కాలువలు కదిలేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై కూడా ఉందని సూచించారు. మలేరియా విభాగం అధికారులతో మాట్లాడి యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని వసతులు కల్పించిందని ప్రజలు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరారు.

ఇన్సూరెన్స్ రంగాన్ని కాపాడుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల నుంచి జాతీయ ఇన్సూరెన్స్ రంగాన్ని కాపాడుకోవడం మనందరి కర్తవ్యమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యాన శనివారం ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ అద్భుతమైన ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థ ఎల్ఐసీ అని పేర్కొన్నారు. ఎల్ఐసీ విజయాలను ప్రచారోద్యమం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ట్రెజరర్ బి.ఎస్.రవి మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగం ముందున్న సవాళ్లు అనే అంశాన్ని వివరించారు. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాలలోని ఎల్ఐసీ కార్యాలయాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు.

అవయవ దానంపై చైతన్యం రావాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అవయవ దానంపై సమాజం చైతన్యవంతం కావాల్సిన అవసరముందని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యాన అవయవదానం, రక్తదానంపై అవగాహన సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. సుహాసిని మాట్లాడుతూ అవగాహన లోపం కారణంగా ప్రపంచంలో విలువైన అవయవాలు బూడిదపాలవుతున్నాయన్నారు. ప్రిన్సిపాల్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్‌ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సాయికాపురం(విజయవాడరూరల్): పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ 262వ వార్డు సచివాలయ పరిధిలో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవితో కలిసి ఆయన పాల్గొన్నారు. వాంబే కాలనీ హెచ్1 బ్లాక్‌లో విస్తృతంగా పర్యటించి 320 గడపలను సందర్శించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. అర్హులందరికీ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్లలో సచివాలయ పరిధిలోని 1,440 కుటుంబాలకు రూ.5.92 కోట్లకు పైగా సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు.

రేషన్‌కార్డుల పంపిణీ

పలువురు అర్జీదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. గతంలో రేషన్ కార్డు పొందాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, ఈ ప్రభుత్వంలో ఆర్నెలకొకసారి కొత్త కార్డులను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో 78,215 తెల్లరేషన్ కార్డుదారులు ఉండగా, నాలుగేళ్లలో 8,258 మందికి కొత్తగా కార్డులు జారీ చేసినట్టు మల్లాది విష్ణు తెలిపారు. ఈ ఒక్క ఏడాదిలోనే 1,146 నూతన కార్డులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. వీరు కార్డులను వినియోగించుకుని పిల్లల చదువులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

అసెంబ్లీలో ప్రతిపక్షం తీరు జుగుప్సాకరం

శాసనసభలో ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరు జుగుప్సాకరమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషించడంలో టీడీపీ విఫలమైందని విమర్శించారు. చట్టసభల్లో రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించకుండా రాజకీయ వేదికలుగా మార్చడానికి యత్నిస్తున్నారని మండిపడ్డారు. అవినీతి కేసులో అరెస్టైన బాబు కోసం, ప్రజా సమస్యలపై సభలో చర్చ జరగనీయకుండా అడ్డుకోవడం సమంజసమా అని ప్రశ్నించారు. పోడియం వద్ద కాగితాలు చించి విసిరివేయడం, స్పీకర్‌ను, ముఖ్యమంత్రిని దుర్భాషలాడుతూ, అనుచితంగా ప్రవర్తిస్తున్న టీడీపీ ఎమ్మెల్యేను ప్రజలు అసహ్యించుకొంటున్నారన్నారు. టీడీపీ రాక్షసకాండను ప్రజాస్వామ్యవాదులు ఖండించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఈఈ(ఇంజినీరింగ్)శ్రీనివాస్, డీఈలు గురునాథం, రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు నందెపు జగదీష్, నాయకులు ఉమ్మడి వెంకట్రావు, నాళంబాబు, భోగాది మురళి, ఆర్ఎస్ నాయుడు, మీసాల బాల నాగమ్మ, వెంకటేశ్వరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు



వివిధ పోటీల విజేతలతో డాక్టర్ కంచర్ల సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఫార్మకోవిజిలెన్స్ పరిజ్ఞానం అందరికీ తప్పనిసరి అన్నారు. మందులు వాడితే దుష్ఫలితాలు వస్తే ఏం చేయాలి, ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన ఉండాలన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.వెంకటరమణ, ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల భక్తితత్వం ముక్తిదాయకం



నాట్యాచారిణికి ప్రశంసాపత్రం అందజేస్తున్న నిడుమోలు రమా సత్యనారాయణ

విజయవాడ కల్చరల్: రాధాకృష్ణుల భక్తితత్వం ముక్తిదాయకమని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం రాధాకృష్ణ మహోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో రాధాకృష్ణుల పాత్ర విశిష్టమైనదని తెలిపారు. విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచానికి తొలి గురువును అందించిన ఘనత భారతీయులకే దక్కుతుందన్నారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ భారతీయ పురాణాలు కృష్ణ తత్వం అంశంగా ప్రసంగించారు. రాధాష్టమి సందర్భంగా ఇస్కాన్ టెంపుల్‌కు చెందిన బాల బాలికలు కృష్ణతత్వం వివరిస్తూ భక్తి గీతాలను, అపర్ణా ప్రసాద్ బృందం సంప్రదాయ కూచిపూడి నృత్యాలను, పోతన భాగవతంలోని పద్యాలను మధురంగా వినిపించారు. నిర్వాహకులు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమాలను కళాపీఠం సభ్యురాలు స్వాతి నిర్వహించారు. సంగీత విభావరిలో పలువురు గాయనీ గాయకులు భక్తి గీతాలను ఆలపించారు.

జనరంజకంగా షార్ట్‌ఫిల్మ్ పోటీలు



మాట్లాడుతున్న యడ్ల పార్థసారథి

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ (టీఎస్ఎఫ్ఏ) ఆధ్వర్యాన 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు శనివారం జనరంజకంగా ప్రారంభమయ్యాయి. సామాజిక, అభ్యుదయ, ఇతివృత్తం ఉన్న అనేక చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సభలో టీఎస్ఎఫ్ఏ గౌరవాధ్యక్షుడు యడ్ల పార్థసారథి మాట్లాడుతూ అనేక మందికి ఈ పోటీల ద్వారా మంచి అవకాశం కలిగిందన్నారు. డాక్టర్ మాకినేని కిరణ్ మాట్లాడుతూ తెలుగు సినిమాకు విశేష కృషి చేసిన గానగంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. టిఎస్ఎఫ్ఎ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.కె.ఎస్.ఎస్.ప్రసాద్, డి.వి.రాజు మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్ పోటీలకు దాదాపు 70 చిత్రాలు వచ్చాయన్నారు.

కొనసాగుతున్న గణపతి నవరాత్రులు



వినాయకనగర్‌లో భోజనాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో గణపతి నవరాత్రులు కొనసాగుతున్నాయి. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో విజయ గణపతికి విభూదితో విశేషంగా అర్చన, అలంకారం చేసి పూజలు నిర్వహించారు.

వినాయకనగర్‌లో..

30వ డివిజన్ వినాయనగర్‌లో అన్నప్రసాద వితరణ జరిగింది. స్థానిక కార్పొరేటర్ బీ హెచ్ఎస్వీ జానారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏటా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించుకోవటం అభినందనీయమన్నారు. సుమారు మూడు వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవి, అడపా చిట్టిబాబు తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ సుబ్బారెడ్డి, దుర్గారావు, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలో..

31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ, కఠారి వెంకట సాయి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన నవరాత్రి మహోత్సవాలలో భాగంగా భారీ అన్నదానం జరిగింది. కార్యక్రమాలను కమిటీ సభ్యులు ఏపుగంటి సాయికృష్ణ పర్యవేక్షించారు.

దుర్గాగ్రహారంలో..

దుర్గా అగ్రహారంలో లక్ష్మీగణపతి సేవాసమితి ఆధ్వర్యాన పంచముఖ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాసమితి సభ్యులు ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ బుధవారం అన్నదానం, 28వ తేదీ గురువారం లడ్డూ వేలం, సాయంత్రం ఊరేగింపు నిమజ్జనం జరుగుతుందని తెలిపారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయకనగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన సంగీత విభావరి భక్తులను భక్తితన్మయత్వంలో తేలియాడించాయి. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు మట్ల రవి, చిన్నబాబు, సూర్య, రమేష్ తదితరులు పర్యవేక్షించారు.

దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదో లైనులో ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులకు వీల్ చైర్, లెమన్ స్పూన్, టగ్ ఆఫ్ వార్ తదితర ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

అనుమానాస్పద మృతి.. కేసు నమోదు..

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబేకాలనీకి చెందిన కలిశెట్టి సుధాకర్(42) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు నున్న పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు వెల్డర్‌గా పని చేస్తున్న సుధాకర్‌కు 2010లో అనూషతో వివాహమైంది. వారికి ఇద్దరు మగ పిల్లలు. మనస్పర్థల కారణంగా భార్యతో విడిపోయి వాంబేకాలనీలో ఎఫ్ బ్లాక్ -133లో ఉంటున్నాడు. అతని తల్లి రోజూ భోజనం తీసుకెళ్లేది. శనివారం భోజనం తీసుకెళ్లిన తల్లికి సుధాకర్ సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకొన్నాడు. స్థానికుల సహకారంతో అతన్ని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుని తమ్ముడు అనిల్‌కుమార్ ఫిర్యాదుతో పోలీసులు అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేశారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అసిస్టెంట్ సీడీపీఓ డి.జోత్స్న సూచించారు. స్థానిక 30వ డివిజన్ కేఎల్‌రావునగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. పోషకాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. అంగన్‌వాడీ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని అతి తక్కువ ఖర్చుతోనే మంచి పోషక విలువలను ఎలా పొందవచ్చో వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.విజయ అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే సేవలను తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు లత, రమణమ్మ అతి తక్కువ ఖర్చుతోనే మంచి పోషకవిలువలతో ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చో ప్రయోగాత్మకంగా పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

నగరంలో జోరు వాన



పటమట(విజయవాడతూర్పు): నగరంలో శనివారం సాయంత్రం జోరు వాన కురిసింది. ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రహదారుల్లో కూడా డ్రైనేజీల్లో నీరంతా రోడ్డుపైకి చేరి రాకపోకలకు అసౌకర్యం కలిగించాయి. ఎంజీ రోడ్డు, కార్ల్‌మార్క్స్‌రోడ్డు, అజిత్‌సింగ్‌నగర్, కృష్ణలంక, పటమట, నిర్మల కాన్వెంట్, లయోల కళాశాల రోడ్డు, మొగల్రాజపురం, విశాలాంధ్ర రోడ్డు, వన్‌టౌన్, బోడెమ్మ హోటల్ సెంటర్, కొత్తపేట, చిట్టినగర్, హనుమాన్‌పేట, సత్యనారాయణపురం, సింగ్‌నగర్, పటమట ప్రాంతాలు నీట మునిగాయి. ఆయా ప్రాంతాల్లో సిబ్బంది నీరు నిల్వున్నచోట్ల తోడిస్తున్నారు.

కళింగ వైశ్య, పొందరలకు కుల ధ్రువీకరణ పత్రాలు అందడానికి చర్యలు

ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



ఎమ్మెల్యే విష్ణును సన్మానించి అభినందనలు తెలుపుతున్న కళింగ వైశ్య, పొందర కుల పెద్దలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కళింగ వైశ్య, పొందర కులస్తులు స్థానికంగా కుల ధ్రువీకరణ పత్రాలు పొందడానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అసెంబ్లీ వేదికగా తన గళం వినిపించిన ఎమ్మెల్యే విష్ణును నగరంలోని ఆయా సామాజిక వర్గాల నాయకులు సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయానికి విచ్చేసి సత్కరించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ కళింగ వైశ్య, పొందర కులస్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రస్తుతం ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో మాత్రమే కులధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని.. కానీ ఈ ప్రాంతంలో స్థిరపడిన ఆయా కులస్తులు పడుతున్న ఇబ్బందులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తన దృష్టికి వచ్చాయన్నారు. వీటిపై సుదీర్ఘ కసరత్తు జరపగా.. ఉన్నతాధికారులతో చర్చలు జరిపి వీలైనంత త్వరలో ఈ కులస్తులు స్థానికంగా క్యాస్ట్ సర్టిఫికెట్లు పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బేడ బుడగ జంగాల సమస్య పరిష్కారానికి అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపుతామన్నారు. వడ్డి వాసు, పట్నాల మురళీకృష్ణ, కలివరపు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో వినూత్న మార్పులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో అనేక మార్పులు రానున్నాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి చెప్పారు. రాఘవాచారి మీడియా అకాడమీ ఆధ్వర్యంలో డిప్లమో ఇన్ జర్నలిజం కోర్సు చేస్తున్న విద్యార్థులకు, వర్కింగ్ జర్నలిస్ట్‌లకు శనివారం ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం జరిగింది. శ్రీనివాసరెడ్డి.. మాధ్యమాల అవసరాలు-కృత్రిమ మేధ (ఏ.ఐ) అనే అంశంపై మాట్లాడారు. చాట్ జీపీటీ, ఎడోబ్ పోడ్కాస్ట్, హ్యామ్, క్యాన్‌వాస్, లెక్సికా ఆర్ట్, ప్యారట్, ఇండిజైన్, సెంటిషియా వంటి సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను ఉపయోగించుకుని మీడియా రంగంలో సులభంగా విధులను నిర్వహించవచ్చని చెప్పారు. గూగుల్‌లో ఈ టూల్స్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఏ అంశంపైనా పూర్తి సమాచారం కోసం చాట్ జీపీటీని ఉపయోగించి తెల్సుకోవచ్చునన్నారు. అవసరమైన ఫొటోల కోసం లెక్సికా ఆర్ట్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా తీసుకోవచ్చన్నారు. వాయిస్ రికార్డ్‌లోని మాటలను ఏ భాషలోకి అయిన మార్పిడి చేసుకుని టైపింగ్ చేసే టూల్స్ కూడా గూగుల్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ టూల్స్ ఉపయోగించుకుంటే చాలా సులభంగా ఆన్‌లైన్ ఎడిషన్లను నిర్వహించవచ్చునని వివరించారు. ఈ టూల్స్‌పై ప్రత్యేక పుస్తకాన్ని కూడా రూపొందించానని శ్రీనివాసరెడ్డి చెప్పారు. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ టూల్స్ గురించి ప్రాక్టికల్‌గా తెలియజేయడానికి జర్నలిస్ట్‌లకు త్వరలో వర్క్‌షాప్‌ను నిర్వహించే ప్రయత్నం చేస్తామన్నారు. జర్నలిజం డిప్లమో కోర్సు చేస్తున్న వారితో పాటుగా వర్కింగ్ జర్నలిస్ట్‌లు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న విద్యాశాఖాధికారి రవికుమార్

అజిత్‌సింగ్‌నగర్,(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు చక్కని పౌష్టికాహారం అందుతుందని విజయవాడ అర్బన్ విద్యాధికాశాఖాకారి కొండా రవికుమార్ అన్నారు. 59వ డివిజన్ సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి పెడుతున్నామని పాఠశాల హెచ్‌ఎం ఎంఎం ఇమామ్‌బాషా ఆయనకు తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులకు స్వయంగా భోజనాలు వడ్డించి వారితో పాటు కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంలో విజయవాడ సెంట్రల్, పశ్చిమ 2వ విద్యాధికారులు బి.సోమశేఖర్‌నాయక్, ఆర్.విజయ రామారావు, హైస్కూల్ హెచ్.ఎమ్ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి రాజారామ్



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి రాజారామ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, మండల న్యాయసేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోవాలని నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి రాజారామ్ సూచించారు. ముత్యాలంపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ పాఠశాలలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ చట్టాలను ఎలా వినియోగించుకోవాలో తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ప్రజలు ఉచితంగా న్యాయవాదిని నియమించుకోవచ్చని, ప్రీ లిటిగేషన్ కేసుల ద్వారా సత్వర న్యాయం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను న్యాయమూర్తి నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్పందన సేవాసమితి అధ్యక్షుడు ఇ.కృష్ణప్రసాద్, ప్యానల్ న్యాయవాది పగిడిపల్లి రాము, బి.శేఖర్‌బాబు, ఎ.యశోద, కె.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగ్‌నగర్ పీఎస్‌లో సీపీ



సీఐ గురుప్రకాష్‌కు జీఎస్ఈ సర్టిఫికెట్‌ను అందిస్తున్న సీపీ టీకే రాణా, పక్కన ఏసీపీ రవికాంత్

అజిత్‌సింగ్‌నగర్/నున్న(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పీఎస్‌ను ఎన్టీఆర్ జిల్లా కమిషనర్ టీకే రాణా శనివారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, కొన్ని కేసులను పరిష్కరించడానికి పోలీసు అధికారులకు సూచనలు చేశారు. దిశ యాప్‌ను వినియోగించేలా మహిళా పోలీసులు మరింత కృషి చేయాలన్నారు. పోలీసులు మెయింటెన్ చేసే రిసెప్షన్, జీడీ ఎంట్రీ తదితర రికార్డులను పరిశీలించారు. సైబర్ నేరాల విషయంలో ప్రభుత్వం చేస్తున్న సూచనలను పాటించాలని, శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. లా అండ్ ఆర్డర్, నేరాల నివారణ వ్యూహాలపై సిబ్బందితో చర్చించారు. స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తంచేసి, సీఐ గురుప్రకాష్‌కు జీఎస్ఈ(గుడ్‌సర్వీస్‌ఎంట్రీ) సర్టిఫికెట్‌ను అందజేశారు. నార్త్ జోన్ ఏసీపీ రవికాంత్ పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక ఉల్లాసానికి కార్నివాల్స్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంస్థ డైరెక్టర్లు అన్నా నందకిషోర్, శ్రీలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, సృజనాత్మకతకు స్టూడెంట్ కార్నివాల్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని శ్రీమేధా విద్యాసంస్థల చైర్మన్ అన్నా నంద కిషోర్ అన్నారు. ఆటోనగర్ ఏటీపీ హాలులో శనివారం జరిగిన స్టూడెంట్ కార్నివాల్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆటపాటల్లో కూడా రాణించాలని, సీఏ వంటి కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఇవి ఆటవిడుపు కలిగిస్తాయని చెప్పారు. సీఏ, సీఎంఏ ఇంటర్‌లో ప్రతిభ కనబరచి ఆలిండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అవార్డులను అందించారు. అనంతరం అధ్యాపక బృందానికి జ్ఞాపికలు అందించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.